ప్రజాశక్తి
సోమవారం 2 జనవరి 2023



సిఐటియు రాష్ట్ర మహాసభల్లో జిల్లా ప్రతినిధులు


ప్రతినిధుల సభలో పాల్గొన్న శ్రీ సత్యసాయి జిల్లా సిఐటియు ప్రతినిధులు

పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో జరుగుతున్న సిఐటియు రాష్ట్ర మహాసభల్లో జిల్లా ప్రతినిధులు పాల్గొన్నారు. జిల్లాకు చెందిన సిఐటియు నాయకులు ప్రతినిధుల హోదాలో మహాసభల్లో పాల్గొన్నారు. టి.షడ్రక్, సావిత్రమ్మ నగర్(అల్లూరి శ్రీరామరాజు కళ్యాణమండపం)లో జరిగిన మహాసభల్లో కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. దీనిపై ప్రతినిధులు చర్చలు జరిపారు.


రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్న గుంత

అధికారుల నిర్లక్ష్యం..

బ్రిడ్జి నిర్మాణంలో జాప్యం..!

ప్రమాదకరంగా మారిన నీటి గుంత

ప్రజాశక్తి-హిందూపురం

అధికారుల నిర్లక్ష్యంమో.... గుత్తేదారుల అశ్రద్ధో తెలియదు గానీ రోడ్డు పనులు పూర్తి కాక ముందే టోల్‌ఛార్జీలు చెల్లించడంతో పాటు ప్రమదాలను సైతం కొని తెచ్చుకోవాల్సిన పరిస్థితి హిందూపురం పురపాలక సంఘం ప్రజల వంతైంది. మండల సర్వేయర్ రోడ్డు మ్యాప్ ఇవ్వక పోవడంతో బ్రిడ్జి నిర్మాణ పనులు తీవ్ర ఆలస్యం అవుతున్న పరిస్థితులు ఉన్నాయి. పురపాలక సంఘం పరిధిలోని శ్రీకంఠాపురం వద్ద నూతనంగా నిర్మాణం చేస్తున్న బ్రిడ్జి పనులు తీవ్ర ఆలస్యం కావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు పనులు చేస్తున్న గుత్తేదారులు నిర్మాణ పనుల్లో భాగంగా రోడ్డులో పెద్ద గుంతను తీసి పనులు అర్ధాంతరంగా ఆపేశారు. ఈ రహదారిలో లేపాక్షి మీదుగా చిలమత్తూరు, కొడికొండ వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో రోజు వందలాది వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఫలితంగా తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నట్లు ఆ ప్రాంత కౌన్సిలర్ గిరీష్ కుమార్ పేర్కొన్నారు. ఎటువంటి సమచారం ఇవ్వకుండా గుంతలు తవ్వడంతో ఈ ప్రాంతంలో దాదాపు 15 కుటుంబాలకు నీటి సరఫరా సైతం ఆగిపోయిందన్నారు. ఈ విషయాన్ని ఛైర్‌పర్సన్ దృష్టికి తీసుకెళ్తే ఆమె దానిని పరిశీలన చేసి తాత్కలిక పైప్‌లైన్ ఏర్పాటు చేయాలని అధికారులు ఆదేశాలు ఇవ్వడంతో వారికి తాత్కలిక పైప్ లైన్ ఏర్పాటు చేసి నీళ్లు ఇస్తున్నామన్నారు. అయితే ఏ క్షణంలో ఏ ప్రమాదం జరుగుతోందని భయంతో ఉందని ఆయన పేర్కొన్నారు. అయితే పనుల ఆలస్యంపై సంబందిత గుత్తేదారులను అడిగితే మండల సర్వేయర్ దానికి సంబంధించిన రోడ్ మ్యాప్ ఇవ్వటంలో తీవ్ర జాప్యం చేస్తున్నారని, అందువల్లనే తాము పనులు చేయలేకపోతున్నామని సదరు కాంట్రాక్టర్ పేర్కొంటున్నట్లు గిరీష్ తెలిపారు. తాత్కాలికంగా ప్రమాదాల నివారణకు తాను చొరవ తీసుకుని ప్రత్యేకంగా నాలుగు పెద్ద లైట్‌లు ఏర్పాటు చేయించానన్నారు. బ్రిడ్జి కోసం తీసిన గుంత వల్ల రాత్రిళ్లు ఎక్కువ ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, అధికారులు వెంటనే చర్యలు తీసుకుని పనులు వేగవంతంగా జరిగే విధంగా చూడాలని కోరారు.

ప్రభుత్వ ఉద్యోగుల్లో ముఖహాజరు గుబులు

కదిరి అర్బన్ : జనవరి నెల నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు ముఖ హాజరు తప్పనిసరి అని ప్రకటించింది. దీంతో ప్రభుత్వ ఉద్యోగుల్లో గుబులు మొదలైంది. ఏ ఇద్దరు ఉద్యోగులు కలిసినా ఈముఖ హాజరు పైనే చర్చ జరుగుతోంది. సకాలంలో విధులకు హాజరు కాకపోయినా ముఖ హాజరు వేయకపోయినా ఆరోజు సెలవు దినంగా పరిగణించే పరిస్థితి నెలకొనడంతో రాష్ట్ర ప్రభుత్వ తీరుపై ఉద్యోగులు తీవ్ర అసంతప్తిని వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు టెక్నికల్ ప్రాబ్లం, మరోవైపు నెట్‌వర్క్ సమస్య ఉన్నా సకాలంలో విధులకు హాజరైనా సెలవులుగా పరిగణించే పరిస్థితి ఏర్పడుతుందని వారు ఆందోళన చెందుతున్నారు. జనవరి 16వ తేదీ నుంచి ప్రతి ఉద్యోగి ముఖ హాజరు తప్పనిసరి అని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నెట్‌వర్క్ సమస్య ఉన్న గ్రామాలలో తాము ఏ విధంగా ముఖ హాజరు వేయాలని ఉద్యోగులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే బయోమెట్రిక్ సరిగా పని చేయక ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నామని కొంతమంది ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యకు తోడు ముఖ హాజరును ప్రవేశపెట్టడంతో తాము మరిన్ని ఇబ్బందులు పడే ప్రమాదం ఉందని ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఓటర్ల జాబితాపై ఆరా

- నేడు కేంద్ర ఎన్నికల సంఘం రాక
- ఉరవకొండలో పర్యటన
- పిఎసి ఛైర్మన్ పయ్యావుల కేశవ్ ఫిర్యాదుపై దర్యాప్తు



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఓటర్ల జాబితాలో అవకతవకలు చోటు చేసుకున్నాయన్న ఆరోపణలపై కేంద్ర ఎన్నికల సంఘం ఆరా తీస్తోంది. నేడు అనంతపురం జిల్లాలోని ఉరవకొండలో కేంద్ర ఎన్నికల సంఘం ప్రిన్సిపాల్ సెక్రటరీ అవినాష్ కుమార్ నేడు జిల్లాకు రానున్నారు. ఢిల్లీ నుంచి నేరుగా బెంగళూరుకు చేరుకుంటారు. అక్కడి నుంచి ఉరవకొండకు చేరుకుంటారు. విడపనకల్లు మండలంలోని చీకలగురికి గ్రామం పరిధిలోని 47,48 పోలింగ్ బూత్‌ల్లో ఓటర్ల జాబితా నుంచి సుమారు నాలుగు వేల ఓటర్లను తొలగించారన్న ఆరోపణలున్నాయి. ఈ ఆరోపణలపై క్షేత్ర స్థాయి పర్యటన నేడు జరుపునుండటం గమనార్హం.

ఓటర్ల జాబితాలో అవకతవకలపై పిఎసి ఛైర్మన్, ఉరవకొండ శాసనభ్యులు పయ్యావుల కేశవ్ ఫిర్యాదుతో విచారణ మొదలైంది. కేశవ్ గత ఏడాది అక్టోబరు 27వ తేదీన కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై నవంబర్ 3వ తేదీన స్పందించిన కేంద్ర ఎన్నికల సంఘం సమగ్రమైన నివేదికివ్వాలని కోరింది. పదేపదే కోరినా స్పందించకపోవడంతో నవంబరు 10వ తేదీన మరోమారు ఎన్నికల సంఘం జిల్లా అధికారులకు 24 గంటల్లో నివేదికివ్వాలని ఆదేశించారు. మొత్తం నవంబరు 21వ తేదీన జిల్లా కలెక్టర్ దీనిపై నివేదికను ఎన్నికల సంఘానికి పంపించడం జరిగింది. దీనిపై సంతృప్తి చెందని పయ్యావుల కేశవ్ డిశెంబరు 7వ తేదీన మరోమారు కేంద్ర ఎన్నికల సంఘానికి ఉత్తరం రాశారు. డిశెంబరు 13వ తేదిన గుంతకల్లు ఆర్డీవోను విచారణ అధికారిగా నియమించారు. డిసెంబరు 29వ తేదీన విచారణ నివేదిక రూపొందింది. తదనంతరం ఈనెల 3వ తేదీన విచారణ నివేదిక ఆధారంగా చీకలగురికి గ్రామం పరిధిలోని 47,48 పోలింగ్ బూత్ అధికారులైన టి.గోపి, మీనుగ మధు అనే ఇద్దరిని సస్పెండ్ చేస్తూ అధికారులు ఉత్తర్వులిచ్చారు. ఇది జిల్లాలో చర్చనీయాంశమైంది. జిల్లా అధికారులు మాత్రం దీనిపై నేరుగా స్పందించడం లేదు. అక్రమాలు జరిగినందుకు కాదని, జాబితా రూపొందించడంలో మార్గదర్శకాలు సక్రమంగా పాటించనందునే వారిపై చర్యలు తీసుకున్నట్టు చెబుతున్నారు. ఇదే సమయంలో కేంద్ర ఎన్నికల సంఘం ప్రిన్సిపాల్ సెక్రటరీ నేరుగా జిల్లాకు వచ్చి జాబితాలోని అవకతవకలపై ఆరా తీయనుండటం అధికారుల్లో గుబులు రేపుతోంది. ఎన్నికలు సమీస్తున్న తరుణంలో ఎన్నికల జాబితాలో అవతవకలు జరుగుతున్నాయన్న ఆరోపణలు ఇతర నియోజకవర్గాల్లోనూ వెల్లువెత్తుతున్నాయి. అర్హులైన వారి పేర్లు కూడా కొన్ని జాబితా నుంచి తొలగించారన్న ఆరోపణలున్నాయి. ఇదే సమయంలో కొన్ని చోట్ల అత్యధిక ఓట్లు చేర్చారన్న ఆరోపణలూ ఉన్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం జిల్లాపై దృష్టి సారించడం, నేరుగా క్షేత్రస్థాయి పర్యటనకు విచ్చేసి విచారణ చేపట్టడం అధికారుల్లోనూ గుబులు రేపుతోంది. ఎవరిపై ఎటువంటి చర్యలుండనున్నాయన్న గుబులు రేగుతోంది.



లబ్ధిదారురాలికి నూతన పింఛన్‌ను అందిస్తున్న కలెక్టర్ బసంత్‌కుమార్

పేదలందరికీ పింఛన్లు

- జిల్లాలో 2,67,149 మంది పెన్షన్ లబ్ధిదారులు
- కొత్తగా 9,047 మందికి లబ్ధి
- కలెక్టర్ బసంత్ కుమార్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లాలో పేదలందరికీ పింఛన్లు అందించేలా అధికార యంత్రాంగం పని చేస్తున్నట్లు కలెక్టర్ బసంత్‌కుమార్ పేర్కొన్నారు. పుట్టపర్తి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి వైఎస్సార్ పెన్షన్ కానుక వారోత్సవాల కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డ్ ఛైర్మన్ రమణారెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ ఓబులపతి, డీఆర్డీఏ పీడీ నరసయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 2,67,149 మంది లబ్ధిదారులకు ప్రతి నెలా రూ.74,09,27,000 నగదును పింఛన్ రూపంగా అందిస్తున్నట్లు చెప్పారు. కొత్తగా 9,047 మందికి పింఛన్లు అందజేసినట్లు చెప్పారు. ఈ జనవరి నుంచి పింఛన్ మొత్తాన్ని 2,750 రూపాయలను అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పింఛన్ లబ్ధిదారులకు రూ.74.09 కోట్ల మెగా చెక్కును అందజేశారు.

అద్దె చెల్లించలేదని సచివాలయానికి తాళం



మూతబడిన హొట్టేబెట్ట గ్రామ సచివాలయం

ప్రజాశక్తి -మడకశిర

రొళ్ల మండలం హొట్టేబెట్ట గ్రామంలోని గ్రామ సచివాలయ భవనానికి ఆభవన యజమాని తాళం వేశారు. భవనానికి అద్దె చెల్లించాలని పలుమార్లు కోరినా పట్టించుకోకపోవటవంతో విధిలేని పరిస్థితిలో తాళం వేసినట్లు భవన యజమాని హనుమంతరాయప్ప చెప్పారు. అందుకు సంబందించిన వివరాలు... రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థ ప్రారంభమైనప్పటి నుండి నేటి వరకు రొళ్ల మండలం హొట్టేబెట్ట గ్రామంలోని గ్రామ సచివాలయం కార్యాలయం అద్దె భవనంలో కొనసాగుతోంది. ఈ భవనానికి నెలకు 3 వేల రూపాయల చొప్పున అద్దె చెల్లిస్తామని భవన యజమాని హనుమంతరాయప్పను ఒప్పించి ఆ భవనంలో కార్యాలయం ఏర్పాటు చేసుకున్నారు. అయితే భవనానికి సంబంధించిన అద్దెను ప్రతినెలా చెల్లిస్తామని చెప్పారు. అయితే ఇప్పటివరకు ఆ భవనానికి అద్దె చెల్లించలేదు. ఇప్పటికే దాదాపు 18 నెలలకు సంబంధించి అద్దె 54 వేల రూపాయలు చెల్లించాల్సుంది. దీంతో భవన యజమాని గత కొన్ని నెలల నుండి అద్దె అడుగుతున్న స్థానిక అధికారులు వాయిదా వేస్తూ వచ్చారు. అద్దె చెల్లించకపోవటంతో భవన యజమాని హనుమంతరాయప్ప సచివాలయ భవనానికి మంగళవారం తాళం వేశాడు. ఈసందర్భంగా హనుమంతరాయప్ప మాట్లాడుతూ తనకు చెల్లించాల్సిన అద్దె బకాయి మొత్తం వెంటనే చెల్లించి తన భవనం ఖాళీ చేయాలని సచివాలయ ఉద్యోగులకు చెప్పారు. దీంతో సచివాలయ ఉద్యోగులు అక్కడే ఉన్న రైతు భరోసా కేంద్రంలోని వెళ్లి విధులకు హాజరైనట్లు వాలెంటీర్ల డివైజ్‌లతో బయోమెట్రిక్ వేశారు. ఈ విషయంపై సంబంధిత అధికారి శ్రీనాథ్ ను వివరణ కోరగా ప్రభుత్వం నుండి నిధులు రాకపోవడంతో తాము అద్దె చెల్లించలేక పోయామని ప్రస్తుత పరిస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. ఇదే గ్రామంలోని కమ్యూనిటీ హాల్‌లో ప్రత్యామ్నాయంగా కార్యాలయం ఏర్పాటు చేసుకోవడానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

జేసీ ప్రభాకర్ రెడ్డి గృహ నిర్బంధం

మున్సిపల్ కార్యాలయంకు వెళ్తుండగా అడ్డుకున్న పోలీసులు


పోలీసులతో వాగ్వాదం చేస్తున్న జెసి.ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-తాడిపత్రి

మాజీ ఎమ్మెల్యే, తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్ రెడ్డిని పోలీసుల గృహ నిర్బంధం చేశారు. మున్సిపల్ కార్యాలయానికి వెళ్తుండగా శాంతిభద్రతల దృష్ట్యా అనుమతి లేదంటూ పోలీసులు ఆయన్ను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా జెసి పోలీసుల తీరుపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ ఛైర్మన్ హోదాలో తాను మున్సిపాల్టీకి వెళ్తుంటే అడ్డుకోవడం ఏమిటని నిలదీశారు. ఈ నేపథ్యంలో కొంతసేపు జెసి ప్రభాకర్‌రెడ్డి ఇంటి వద్ద ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకున్నాయి. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... తాడిపత్రి పట్టణంలోని ఎన్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఉదయం తాడిపత్రి పట్టణ, రూరల్ మండలంకు సంబంధించి వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ కార్యక్రమాన్ని అధికారులు చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి హాజరు అయ్యారు. ఇదే కార్యక్రమానికి తాడిపత్రి మున్సిపాల్టీ నుంచి ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డికి ఆహ్వానం అందింది. ఈ నేపథ్యంలో జెసి మున్సిపల్ కార్యాలయానికి వెళ్లేందుకు ఇంటి నుంచి బయల్దేరారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు పెద్ద సంఖ్యలో జెసి ఇంటి వద్దకు చేరుకుని ఆయన్ను అడ్డుకున్నారు. ఎమ్మెల్యే పెద్దారెడ్డి, జెసి.ప్రభాకర్‌రెడ్డి ఒకే కార్యక్రమంలో పాల్గొంటే శాంతిభద్రతల సమస్య నెలకొంటుదన్న ఉద్దేశంతో పోలీసులు జెసికి 41 నోటీసు ఇచ్చి ఆయన్ను ఇంటి నుంచి బయటకు వెళ్లకుండా అడ్డుకున్నారు. ఛైర్మన్‌గా ఉన్న తనను అడ్డుకోవడం ఏమిటంటూ జెసి పోలీసులతో వాగ్వాదానికి దిగారు. అయినా పోలీసులు ఆయన్ను వెళ్లనివ్వకుండా అడ్డుకున్నారు. దీంతో జెసి ఇంట్లోనే ఉండిపోయారు. తాడిపత్రిలో పోలీసులు వ్యవహరిస్తున్న తీరు సరికాదంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రజలకు అందుబాటులో ఉండండి

కలెక్టర్ బసంత్‌కుమార్


సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ బసంత్‌కుమార్

ప్రజాశక్తి - పరిగి

సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందుబాటుటో ఉండాలని కలెక్టర్ బసంత్ కుమార్ ఆదేశించారు. ఈ మేరకు ఆయన మంగళవారం మండలంలోని కోడిగినహళ్లి సచివాలయాలని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయ కేంద్రాలలో గ్రామస్తుల పొందుతున్న ఈ సర్వీసులను పరిశీలించారు. భవనాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కొడిగేనహళ్లి 3 సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ ఇమ్రాన్ ఈ సర్వీస్ లో 90 శాతం టార్గెట్ ను పూర్తిచేసి ప్రభుత్వ ఆదాయానికి ఆదాయ వనరులను సమకూర్చడంపై కలెక్టర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ ఉద్యోగిని అవార్డుకు ఎంపిక చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సౌజన్యలక్ష్మి, ఎంపీడీవో సరస్వతి, ఇఒఆర్‌డి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

8న కేంద్ర హోం మంత్రి పుట్టపర్తికి రాక

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఈనెల 8న పుట్టపర్తికి వస్తున్నట్లు బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయనతోపాటు ఆ పార్టీ నాయకులు ప్రశాంతి గ్రామ్ వద్ద జరిగే బహిరంగ సభ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 25 వేల మందితో బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యుడు కదిరి పార్థసారధి, జిల్లా నాయకులు రమేష్ నాయుడు, ఉత్తమ రెడ్డి, వజ్ర భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.


ఫిర్యాదు అందజేస్తున్న శ్రీ రంగరాజుపల్లి గ్రామస్తులు

ట్రాన్స్‌ఫార్మర్ అమ్మకం..!

విద్యుత్ ఉద్యోగి అవినీతిపై విచారణ

ప్రజాశక్తి- పరిగి

ఓ రైతు నుండి 90వేల రూపాయలు ముడుపులు తీసుకుని పంచాయతీ పరిధిలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను అమ్ముకున్నాడని గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో ఈ అవినీతిపై ఉన్నతాధికారులు మంగళవారం విచారణ నిర్వహించారు. పరిగి మండలం శ్రీరంగరాజుపల్లిలో జరిగిన ఈ ఘటనా వివరాలు... మండలంలోని శ్రీరంగరాజుపల్లిలో తీవ్ర తాగునీటి సమస్య నెలకొంది. దీంతో సమస్య పరిష్కారానికి పంచాయతీ నిధుల ద్వారా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను అధికారులు మంజూరు చేశారు. అయితే ఆ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో నాసిరకం ట్రాన్స్‌ఫార్మర్‌ను అదే గ్రామానికి చెందిన లైన్మెన్ హారుణ్ భాష ఏర్పాటు చేసి ప్రభుత్వం మంజూరు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఒక రైతుకు అమ్మకానికి పెట్టాడని ఉప సర్పంచి మురళీమోహన్ రెడ్డి ఎఇ నిజముద్దీన్‌కు ఫిర్యాదు చేశాడు. దీంతో ఎఇ గ్రామంలో మంగళవారం విచారణ నిర్వహించాడు. ఉపసర్పంచి చేసిన ఫిర్యాదు నిజం అని తేలింది. దీంతో లైన్‌మెన్‌పై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు నివేదిక పంపాలని స్థానికులు కోరారు.

అవ్వాతాతలకు జగనన్న సర్కార్ తోడు ..

ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్


నూతన పింఛన్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ ఇక్బాల్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ

ప్రజాశక్తి-హిందూపురం

బడుగు బలహీన వర్గాల వారికి జగనన్న సర్కార్ తోడుగా ఉంటుందని ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ పేర్కొన్నారు. మంగళవారం పురపాలక సంఘ పరిధిలోని 13వ వార్డు సడ్లపల్లిలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజతో కలిసి పెంచిన పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతు రాష్ట్రంలోని అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించి పేదల జీవితాలు వెలుగు నింపడమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందన్నారు. అనంతరం పెంచిన పెన్షన్‌లను పంపిణీ చేశారు. అదే విధంగా పట్టణంలో వివిధ వార్డుల్లో మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ ఛైర్మేన్ జబివుల్లా, 14వ వార్డులో వైస్ ఛైర్మేన్ బలరామిరెడ్డి, ఆయా వార్డుల్లో కౌన్సిలర్లు లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కొండూరు వేణుగోపాల్‌రెడ్డి, వార్డు కౌన్సిలర్ సునీత వెంకటేష్ రెడ్డి, కౌన్సిలర్లు మారుతీరెడ్డి, అయూబ్, చిన్నమ్మ, ముస్తక్, రహమత్‌బి, మణి, సచివాలయ కన్వీనర్లు శ్రీనివాసరెడ్డి, స్వాతి, బాబా, తిమ్మారెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగం పొందిన విద్యార్థినికి ఎస్పీ అభినందన

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

పోలీస్ కాంపిటేటివ్ ఎగ్జామ్స్ స్టడీ సెంటర్ కమ్ డిజిటల్ లైబ్రరీలో పోటీ పరీక్షల నిమిత్తం చదువుకుంటున్న శ్రీ సత్యసాయి జిల్లా అమరాపురం గ్రామానికి చెందిన విద్యార్థిని లావణ్య కర్నాటక గ్రామీణ బ్యాంక్‌లో ఉద్యోగం పొందింది. ఈ సందర్భంగా మంగళవారం నాడు ఎస్పీ డా॥ఫక్కీరప్ప స్థానిక పోలీసు కాన్ఫిరెన్స్ హాల్లో ఆమెను సతకరించి, జ్ఞాపికను అందజేశారు. తనకు ఉద్యోగం రావడంలో అనంతపురం పోలీస్ లైబ్రరీ ఎంతో దోహం చేసిందని విద్యార్థిని లావణ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఐ ప్రవీణ్ కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థినికి మెమోంటో అందజేస్తున్న ఎస్పీ ఫక్కీరప్ప

ఆదర్శనీయురాలు సావిత్రిబాయి పూలే



ధర్మవరంలో మాట్లాడుతున్న శ్రీసత్యకృప మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మల్లికార్జున

ధర్మవరం టౌన్ : స్త్రీల విద్యాభివృద్ధికి సావిత్రిబాయ్ పూలే కృషి మరువలేనిదని శ్రీసత్యకృప మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మల్లికార్జున పేర్కొన్నారు సావిత్రిబాయ్ పూలే జయంతినిస్థానిక శ్రీసత్యకృప మహిళా డిగ్రీకళాశాలలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ డోలాపెద్దిరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు. అదేవిధంగా కాకతీయ విద్యానికేతన్లో మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈకార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు సూర్యప్రకాశ్ రెడ్డి, పద్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **రామగిరి:** స్థానికమహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతిని మంగళవారం జరిగాయి.సావిత్రి బాయ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ మునిరత్నమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హిందూపురం : బాలికల విద్యకు ఆద్యురాలు క్రాంతి జ్యోతి సావిత్రి బాయి పూలే అని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి అన్నారు. సావిత్రి బాయి పూలే జయంతి వేడుకలను మంగళవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీనివాస ఐటీఐ కళాశాలలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు చంద్రశేఖర్, హర్ష కుమార్, మహేష్, ఇంతియాజ్,తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా యుటిఎఫ్, బిఎస్పి ఆధ్వర్యంలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎస్ఎస్పిఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ తిరుమలమ్మ, సామాజిక విప్లవకారిణి సావిత్రి పూలే అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీధర్, డాక్టర్ యశోద రాణి, శ్రీలక్ష్మి, సరస్వతి, పార్వతి, రామన్న తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ పట్టణంలోని బీసీ బాలికల హాస్టల్ నందు బీసీ ప్రచార కమిటీ రాష్ట్ర అధ్యక్షులు సంపంగి గోవర్ధన్ ఆధ్వర్యంలో సావిత్రిబాయ్పూలే జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కదిరి డివిజన్ బీసీ సంక్షేమ శాఖ అధికారి గంగాద్రి పాల్గొన్నారు. ఈసందర్భంగా డివిజన్ బిసి సంక్షేమ శాఖ అధికారి గంగాద్రి కి, కదిరి బీసీ బాలికల హాస్టల్ వార్డెన్ లీలావతికి సంపంగి గోవర్ధన్ శాలువాలు, పూల మాలతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో బీసీ ప్రచార కమిటీ రాష్ట్ర అధ్యక్షులు సంపంగి గోవర్ధన్, కదిరి డివిజన్ బీసీ సంక్షేమ శాఖ అదికారి గంగాద్రి, బీసీ బాలికల హాస్టల్ వార్డెన్ లీలావతి, బీసీ బాలుర హాస్టల్ వార్డెన్ సుబ్బరాయుడు,బీసీ ప్రచార కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోటకొండ క్రిష్టప్ప, నాయకులు బత్తల శ్రీనివాసులు, శ్రావణ్ కుమార్, జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.



సావిత్రిబాయి పూలేకు నివాళులర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి

నంబులపూలకుంట : సావిత్రిబాయి పూలే జయంతిని మండల వనరుల కేంద్రంలో వైఎస్ఆర్టిఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయులు సౌభాగ్య, రాధమ్మ, వరలక్ష్మిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్టిఎఫ్ నాయకులు గంగాధర్ రెడ్డి, వెంకటరామిరెడ్డి, ఎంఇఒ గోపాల్ నాయక్, ప్రధానోపాధ్యాయులు తిరుపాల్ నాయక్, ఆంజనేయులు నాయక్, షఫీ, మురళి, రమణా నాయక్, రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడిపి జిల్లా అధ్యక్షులు బికె

గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయండి

రొద్దం : గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని సత్యసాయి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బి.కె పార్థసారథి సూచించారు. మంగళవారం మండలంలోని ఆర్. మరవపల్లి గ్రామంలో పెనుకొండ నియోజకవర్గంలోని గోరంట్ల మండలం గంగంపల్లి గ్రామ పంచాయతీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల తొమ్మిదిన గంగంపల్లి గ్రామంలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమం నిర్వహిస్తున్నామని గ్రూపు రాజకీయాలు, కక్ష సాధింపులు పక్కనపెట్టి ఈ కార్యక్రమం విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పెనుకొండ నియోజకవర్గం అధ్యక్షులు చిన్నప్పయ్య, గోరంట్ల మండలం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని అలవర్చుకోండి

మడకశిర : మండల పరిధిలోని కల్లుమరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం అందించిన ట్యాబ్లను స్థానిక సర్పంచి కుమారుడు నాగరాజు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నారాయణ గౌడ్ , వెంకటరమణప్ప , కదిరి నరసింహప్ప, మధుసూదన్ గౌడ్, ఉపాధ్యాయులు , విద్యార్థులు పాల్గొన్నారు .

పేదల పక్షపాతి సిఎం జగన్

కదిరి టౌన్ : పేదలు, వృద్ధుల, వికలాంగుల, వితంతువుల నిజమైన పక్షపాతి సీఎం వైఎస్ జగన్ అని వైసిపి నాయకులు బాహుద్దీన్, కౌన్సిలర్ దిల్షాద్షా అన్నారు. మంగళవారం పట్టణంలోని పదో వార్డు లో నూతనంగా మంజూరైన పింఛన్లను వారు అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు అడ్మిన్ ఆసిఫ్, బాబాజాన్, షరీఫ్, కార్తీక్, ప్రవీణ్, శివమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

పుట్టపర్తి అర్బన్ : మండల పరిధిలోని ఎగువ గంగిరెడ్డిపల్లిలో విద్యార్థులకు ఖిద్మత్ ఏ ఖల్క్ వెల్ఫేర్ ట్రస్ట్ ప్రతినిధులు శామీర్, షేక్షావలి, షాకీర్, శ్రావణ్ తదితరులు విద్యాసామగ్రిని అందజేవారు. ఆ గ్రామ ప్రాథమిక పాఠశాలలో 63 మంది విద్యార్థులకు పలకలు, నోటు పుస్తకాలు, పెన్సిల్లు, పెన్నులు అందజేశారు. ఈ సందర్భంగా షామీర్ మాట్లాడుతూ సత్యసాయి భక్తుడు వెంకటసుబ్బయ్య సహకారంతో మారుమూల గ్రామంలో వీటిని అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో పోస్ట్మెన్ అల్లా ప్రకాష్, ఉపాధ్యాయుడు జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు డిజిటల్ విద్య

హిందూపురం : పేద విద్యార్థులకు ప్రభుత్వం డిజిటల్ విద్యను అందిస్తున్నామని మున్సిపల్ చైర్పర్సన్ డిఎన్ ఇంద్రజ పేర్కొన్నారు. మంగళవారం పురపాలక సంఘ పరదిలోని రవీంద్రనాథ్ ఠాగూర్ పాఠశాలలోని 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇంద్రజ మాట్లాడుతు ఆర్థికంగా వెనుకబడిన వారు కూడా కార్పొరేట్ స్థాయిలో విద్యను అందుకోవాలని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి డిజిటల్ విద్యను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ చిన్నమ్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు స్వప్న, వైసిపి నాయకులు శ్రీరాములు, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ట్యాబ్లు పంపిణీ చేస్తున్న చైర్పర్సన్ డిఎన్ ఇంద్రజ

పకడ్బందీగా రీ సర్వే పనులు

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్



అధికారులతో మాట్లాడుతున్న సంయుక్త కలెక్టర్ టిఎస్ చేతన్

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న భూ రక్ష వైయస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష కింద చేపడుతున్న రీసర్వే పనులు వేగవంతంగా పకడ్బందీగా చేపట్టాలని సంయుక్త కలెక్టర్ టిఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్లోని తన చాంబర్లో సంబంధిత అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంయుక్త కలెక్టర్ మాట్లాడుతూ సర్వే అధికారులు సిబ్బంది సమన్వయంతో పనిచేసి నిర్దేశించిన గడువులోగా సర్వే పనులు పూర్తి చేయాలన్నారు. ఏమైనా సమస్యలు ఎదురైతే తన దృష్టికి తేవాలన్నారు. ఎలాంటి అలసత్వం చూపకుండా క్షేత్రస్థాయిలో భూ రక్ష భూ హక్కు సర్వేపనులు సజావుగా నిర్వహించాలన్నారు. ప్రస్తుతం జిల్లాలో 30 దాకా కొత్తగా ఒఆర్ఐ మ్యాపులకు సంబంధించిన భూ సర్వే పనులు త్వరగతిన పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో సర్వే శాఖ ఎడి రామకృష్ణ, రీ సర్వే నోడల్ అధికారి శ్రీనివాసులు, సర్వేయర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

టిడిపిలో పలువురు చేరిక



పార్టీలోకి చేరిన వారితో కందికుంట

కదిరి టౌన్ : టిడిపి నియోజకవర్గ ఇన్ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ సమక్షంలో బిజెపి కి చెందిన పలువురు తెలుగుదేశం పార్టీలోకి చేరారు. ఒబిసి మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి తేపల్లె మనోహర్ బ్రదర్స్ టిడిపిలో చేరారు. ఈ మేరకు కదిరి పట్టణంలోని మనూస్ డాన్స్ అకాడమీ నందు జరిగిన కార్యక్రమంలో డాక్టర్ తేపల్లె మనోహర్, తేపల్లె వాసు ఆధ్వర్యంలో 30 మంది తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కందికుంట మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీతోనే బడుగు బలహీన వర్గాలకు మేలు జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, బీసీ రాష్ట్ర నాయకులు వడ్డే రామాంజనేయులు బాబు, కౌన్సిలర్ ఆల్ఫా ముస్తఫా ,మేకల రమణ ,షాన్వాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేత

రొద్దం : మండలంలోని తురకలపట్నం జెడ్పీ హెచ్ పాఠశాలలోని 200 మంది విద్యార్థులకు అట్టలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ నెల 15న తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ పుట్టినరోజు సందర్భంగా వీటిని పంపిణీ చేసినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో దాత శివనంద, జయంత్, శ్యాం, మని, శివశంకర్, ఉపేంద్ర మారుతీ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం

ధర్మవరం టౌన్ : అనారోగ్యంతో మృతిచెందిన పట్టణంలోని జోగానికుంటకు చెందిన బెస్త రాజమ్మ కుటుంబానికి బెస్త సేవాసంఘం ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందజేశారు. బెస్త రాజమ్మ ఇటీవల క్యాన్సర్ వ్యాధిన పడి మృతిచెందింది. దీంతో ధర్మవరం పట్టణ బెస సేవాసంఘం ఆధ్వర్యంలో నాయకులు మృతురాలి భర్త బెస్తరామును పరామర్శించారు. అనంతరం బెస్తరాముకు రూ.20వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బెస్త సేవాసంఘం పట్టణ అధ్యక్షులు దత్తశివ, మార్కెట్యార్డ మాజీ వైస్ చైర్మన్ గడ్డం జిఆర్ రామ్మోహన్, నాయకులు బెస్త ఓబుళవెంకటపతి, గడ్డంకుమార్, గడ్డంసూరి. బెస్త శ్రీనివాసులు,బెస్త వెంకటరమణ, బెస్తకరుణాకర్, బెస్త అంజి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

కొత్తచెరువు : సీజనల్ వ్యాధుల పైన గ్రామాల్లో ప్రజలకు ఆశా కార్యకర్తలు అవగాహన కల్పించాలని వైద్యాధికారి డాక్టర్ సునీల్ కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో మండలంలోని ఆశా కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో సీజనల్ వ్యాధుల పైన ప్రజలకు అవగాహన కల్పించాలని అలాగే పరిసరాల పరిశుభ్రత గురించి వివరించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ గౌరీదేవి, ఎంపీహెచ్ఒ కంబగిరి స్వామి, సుబ్బరాయుడు, సూపర్వైజర్లు నరసింహులు, సూర్యనారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

ఓబుల దేవర చెరువు : మండల పరిధిలోనిదాదిరెడ్డిపల్లి గ్రామ సమీపంలో గల అక్కదేవతల ఆలయానికి దాతలు 35 వేల రూపాయలు విలువగల వెండి ఆభరణాలను వితరణ చేశారు. దాతలు రెడ్డివారిపల్లె గ్రామానికి చెందిన ప్రమీల, గోరంట్ల గ్రామానికి చెందిన నాగరాజు మంగళవారం ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో వెండి ఆభరణాలను ఆలయ పూజారి వెంకటేష్కి అందించారు.



సిఎం జగన్తో రాజశేఖర్రెడ్డి

సిఎంను కలిసిన మున్సిపల్ వైస్ చైర్మన్

కదిరి టౌన్ : రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిని కదిరి మున్సిపల్ వైస్ చైర్మన్ రాజశేఖర్ రెడ్డి ఆ పార్టీ నాయకులు కుర్లి శివారెడ్డి తదితరులు కలిశారు. ఈ మేరకు వారు కడప జిల్లా వేంపల్లి మండలం ఇడుపులపాయలో సిఎంను మర్యాదపూర్వకంగా కలిశారు.

నెమలిని సంరక్షించిన యువకులు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలో మూడు బావుల సమీపంలో మంగళవారం జాతీయ పక్షి నెమలి గాయపడి పడి ఉండటాన్ని గమనించిన యువకులు దానిని సంరక్షించారు. యువకులు వెంకటేష్, దుర్గయ్య, చందన్, శివ నెమలి గాయపడిన విషయాన్ని లైఫ్ వరల్డ్ చారిటబుల్ ట్రస్ట్ కన్వీనర్ ఉదయ్ కుమార్కు సమాచారమందించారు. స్పందించిన ఆయన ఫారెస్ట్ రెంజ్ ఆఫీసర్ అక్బర్కు సమాచారం అందించారు. వారి సూచన మేరకు గాయపడిన నెమలిని ఫారెస్ట్ డిపార్ట్మెంట్ వాచెర్ ఆంజనప్పకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో మురళి దేశాయి, కృష్ణ నాయక్, శీనా, నేపాల్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



గాయపడిన నెమలిని చూపిస్తున్న యువకులు

ట్యాబ్లు పంపిణీ

బత్తలపల్లి : స్థానిక మహాత్మాగాంధీ జ్యోతిరావ్ పూలే బాలుర పాఠశాలలోనూ, రామాపురం ఉన్నత పాఠశాలలోని 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్లు మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గుర్రం వనజ, జెడ్పీటీసీ కోటి సుధ, సర్పంచు బండి సరస్వతి, బండి రాములమ్మ, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాడ్మింటన్ పోటీలకు రామాపురం విద్యార్థిని ఎంపిక

బత్తలపల్లి : ఇటీవల ప్రొద్దుటూరులో జరిగిన అండర్ 14 స్కూల్ గేమ్స్ బాల్ బాడ్మింటన్ పోటీలకు స్థానిక రామాపురం పాఠశాలకు చెందిన మౌనిక ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీరాములు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ తమ పాఠశాలకు చెందిన విద్యార్థిని జాతీయస్థాయి బాల్ బాడ్మింటన్ పోటీలకు ఎంపికవడం పట్ల ఆనందంగా ఉందన్నారు. విద్యార్థినిని ఫిజికల్ డైరెక్టర్ లక్ష్మినారాయణ, సర్పంచు బండి సరస్వతి, వైసిపి నాయకులు బండి వీరనారప్ప, ఉపాధ్యాయులు వరదరాజులు, రవీంద్ర, చంద్రశేఖర్, లక్ష్మిదేవి, సుల్తానా బేగం, పద్మావతి, సుమలత, ప్రమీల, సౌజన్య, స్థానిక నాయకులు తదితరులు అభినందించారు.

అసైన్మెంట్ కమిటీ జాబితాను తయారు చేయండి

బత్తలపల్లి : మండలంలో జరుగుతున్న రీసర్వేపైన, రైతులకు ఇవ్వాల్సిన అసైన్మెంటు భూముల వివరాలు జాబితాను త్వరితగతిన తయారు చేయాలని తహశీల్దార్ యుగేశ్వరీదేవి విఆర్ఒలను ఆదేశించారు. ఈ మేరకు ఆమె మాట్లాడుతూ అసైన్మెంటు కమిటీలో దరఖాస్తు చేసుకున్న రైతుల అర్హతను పరిశీలించాలన్నారు. అదేవిధంగా మండలంలో జరుగుతున్న రీసర్వేపై ఆరా తీశారు. స్పందన కార్యక్రమంలో వచ్చిన పిర్యాధులను పరిశీలించి వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ సునీత తదితరులు పాల్గొన్నారు.

వైసిపిలో పలువురు చేరిక

చెన్నేకొత్తపల్లి : మండలంలోని బసంపల్లికి చెందిన పలువురు టిడిపి కార్యకర్తలు వైసిపిలో చేరారు. గ్రామానికి చెందిన గొల్లప్ప గారి పెద్ద శివయ్య, గొల్లప్ప గారి వేణుగోపాల్, అశోక్ కుమార్, వంశీ, శివానంద, సుబ్రహ్మణ్యం, కుమ్మరి శీన, చిన్న కుంట, వెంకటేష్, నారాయణస్వామి, కిరణ్, శ్రీరాములు, పీసు బయన్న, మహేష్, మల్లప్ప, వనిశెట్టి, గిత్తప్ప గారి నాగేంద్ర, చాపల ఓబులేసు, కోట్ల రామకృష్ణ కుటుంబాలు ఈసందర్భంగా వైసిపిలో చేరాయి. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో వారందరూ పార్టీ కండువాలు కప్పుకున్నారు.ఈసందర్భంగా బసంపల్లిలోని ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి ఎమ్మెల్యే 2 లక్షల రూపాయలు విరాళంగా అందజేస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రాప్తాడు సీనియర్ నాయకులు తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి, సీనియర్ నాయకుడు సత్తిరెడ్డి, మండల కన్వీనర్లు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, చైర్మన్లు, డైరెక్టర్లు, మండల నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

హాకీజిల్లా జట్టుకు కొత్తచెరువు విద్యార్థులు

కొత్తచెరువు : ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు విడపనకల్ మండలం పాల్తూరు ఉన్నత పాఠశాలలో హాకీ పోటీలు నిర్వహించారు. ఈ హాకీ పోటీలలో కొత్తచెరువు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక అయ్యారు. హాకీ అండర్ 14 లో మహేంద్ర బాబు, సాదిక్ వలి, అండర్ 17 లో శివానంద జిల్లా స్థాయి జట్టుకు ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయి పోటీలలో వీరు అనంతపురం జిల్లా తరఫున పాల్గొంటారన్నారు. ఈ రాష్ట్ర స్థాయి పోటీలో తూర్పుగోదావరి జిల్లాలో నిర్వహిస్తున్నట్లు పాఠశాల హెచ్ఎం చెన్నకృష్ణారెడ్డి తెలిపారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

గోరంట్ల : పార్టీలకు అతీతంగా అర్హులకు సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని శాసనసభ్యులు శంకర్ నారాయణ తెలిపారు. పట్టణంలోని పెద్ద మసీద్ ప్రాంతంలో మంగళవారం నిర్వహించిన గడపగడప మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ లక్ష్మి నరసప్ప, సర్పంచి సరోజ నాగే నాయక్, జెడ్పీటీసీ జయరాం నాయక్, సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ శంకర్ రెడ్డి, డీలర్ నరసింహారెడ్డి, అగ్రి చైర్మన్ రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బస్స్టేషన్లలో వ్యాపారాల నిర్వహణకు టెండర్ల ఆహ్వానం

పుట్టపర్తి అర్బన్ : సత్యసాయి జిల్లాలో గల ఆర్టీసీ బస్ స్టేషన్లలో, ఖాళీ ప్రదేశాల్లో చిరు వ్యాపారం చేసుకునే వారికి షీల్డ్ టెండర్లను ఆహ్వానిస్తున్నామని జిల్లా ఆర్టీసీ ప్రజా రవాణా అధికారి మధుసూదన్ తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ఆరు నియోజకవర్గాలలో బస్ స్టేషన్లలో పక్క అంగళ్లు నిర్వహించుకునేందుకు ఖాళీ స్థలాలలో వ్యాపారాలు నిర్వహించుకొనుటకు టెండర్లు ఆహ్వానిస్తున్నామన్నారు. మొత్తం 100 ప్రదేశాల్లో చిరు వ్యాపారులు వ్యాపారాలు నిర్వహించుకోవచ్చు అన్నారు. ఆసక్తిగల వారు ఆయా డిపోల మేనేజర్లను సంప్రదించి టెండర్ల ఫారాలు ఈనెల 18 లోపల పొందవచ్చని చెప్పారు.

వైసిపిని ఇంటికి సాగనంపుదాం : టిడిపి

పుట్టపర్తి అర్బన్ : వైసిపిని ఇంటికి సాగనంపుదామని టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ పిలుపునిచ్చారు. ఈ మేరకు టిడిపి నాయకులు మంగళవారం పట్టణంలోని ఆరవ వార్డులో ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదినారాయణ మాట్లాడుతూ మూడున్నర ఏళ్ల వైసిపి పాలనలో ప్రజలపై భారాలు మోపి బాదుడే బాదుడు కార్యక్రమం చేపట్టిందన్నారు. ధరలు నియంత్రించలేక పోవడంతో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటాయని సామాన్యుడు ఏమి కొనలేని దుస్థితి ఏర్పడిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐ టిడిపి నియోజకవర్గం అధ్యక్షులు జయప్రకాష్, నాయకులు బేకరీ నాయుడు, క్రిష్టప్ప, మల్లికార్జున, బుడ్డప్ప, ముకుంద, శంకర్, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

సూసైడ్ నోట్ రాసి యువకుడి ఆత్మహత్య



నవీన్కుమార్ (పాతచిత్రం)

చిలమత్తూరు : తనకు జరిగిన అవమానికి సహించలేక ఆత్మహత్య చేసుకుంటున్నానని సుసైట్ నోట్ రాసి, సెల్ఫీ వీడియో తీసి ఉరివేసు కొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన చిలమత్తూరులో కలకలం రేపింది. అందుకు సంబందించిన వివరాలు... మండల పరిదిలోని మొరసల పల్లి గ్రామ శివారులో గత కొద్దిరోజుల క్రితం కర్నాటకకు చెందిన నవీన్ కుమార్ ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈఘటనపై తమకు అనుమానం ఉందని ఇది ఆత్మహత్య కాదని హత్య అని హత్యకు కారణం తమ సమీప బంధువులైన హరీష్, మరొక యువకుడు అని ఆరోపిస్తూ మృతుని బంధువు ప్రతాప్(నవీన్ మామ) ఆరోపించాడు. ఈ నేపథ్యంలో ప్రతాప్ తో పాటు నవీన్ తల్లిదండ్రులు సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఇదే విషయంపై ఫిర్యాదు చేశారు. ఈ విషయంలో తన ప్రమేయం లేక పోయిన ప్రతాప్ తమను కావాలనే ఇరికిస్తున్నాడని మొరం పల్లి గ్రామానికి చెందిన హరీష్ (25) మనస్థాపానికి గురై సెల్ఫీ వీడియో, సుసైట్ నోట్ రాసి సంజీవ రాయుని పల్లి శివారుల్లో చింత చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. 'రే ప్రతాప్ నువ్వు మా అన్నరా.. మా పెద్దమ్మ కొడుకువి. కాని నీకు మాపై నమ్మకం లేదు. నవీన్ నాకు అల్లుడు అవుతాడు, ఎలా చంపుతాను. ఇందులో మాకు ఎలాంటి సంబందం లేదు. అయిన కావాలనే నువ్వు చేస్తున్నావు. నాకు అవమానం చేసావు. నీవల్లే నేను ఆత్మహత్య చేసుకుంటున్నా, నాకు అప్పులు ఉన్నాయి వాటిని నువ్వే కట్టాలి,మా అమ్మ ఆమే నీకు పిన్నమ్మ వారిని నువ్వే చూసుకోవాలి' అని సుసైట్ నోట్ హరీష్ రాశాడు. ఇక సెల్ఫీ వీడియో లో ఎమ్మెల్సీ ఇక్బాల్, ఎంపీ మాదవ్, ఎస్ఐ, సిఐలు తమ కుటుంబానికి న్యాయం చేయాలని నాపై ప్రతాప్ సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేశాడని మా నాన్నతో నేను చేయించిన అప్పును ప్రతాప్ తోనే కట్టించాలని చెప్పాడు. తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని అయిన ప్రతాప్ తో గొడవకు వెళ్లకు అన్న అని కూడా అందులో ఉంది. ఆ సెల్ఫీ వీడియో, సుసైట్ నోట్ చూసి కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరు అయ్యారు. విషయం తెలుసుకున్న ఎస్ ఐ శ్రీనివాసులు ఘటన స్థలానికి వెళ్లి సుసైట్ నోట్, మొబైల్ను స్వాధీనం చేసుకున్నాడు. మృతుడు హరీష్(25) సుసైట్ నోట్,సెల్ఫీ వీడియో ఆధారంగా ప్రతాప్తో పాటు మరో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు

మహిళ ఆత్మహత్యాయత్నం

ధర్మవరం టౌన్ : పట్టణంలోని సత్యసాయినగర్కు చెందిన మహిళ మంగళవారం రాత్రి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కాలనీకి చెందిన మంజునాథ్ భార్య సునిత వాజ్మల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స నిర్వహించారు. మంజునాథ్ కర్నాటక రాష్ట్రంలో సోలార్ కంపెనీలో ఎలక్ట్రిషియన్గా పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో మంజునాథ్ తన భార్య సునీతతో గొడవపడ్డాడు. దీంతో ఆమె ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ మేరకు టూటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భార్యపై భర్త దాడి..

ధర్మవరం టౌన్ : పట్టణంలోని ప్రియాంకనగర్లో సురేష్ కుమార్ అనే వ్యక్తి తన భార్య వరలక్ష్మిపై దాడికి పాల్పడ్డాడు. భార్యపై అనుమానం పెంచుకున్న సురేష్కుమార్ మంగళవారం రాత్రి ఆమెను కొట్టాడు. గాయపడిన వరలక్ష్మిని స్థానికులు గమనించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వన్టౌన్ పోలీసులు తెలిపారు.

ఆలయ అభివృద్ధికి సహకరిస్తా

కదిరి టౌన్ : నల్లచెరువు మండలం గోరంట్ల వారి పల్లిలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి సహకరిస్తానని డాక్టర్ బత్తల హరిప్రసాద్ చెప్పారు. ఈ మేరకు ఆగ్రామానికి చెందిన పలువురు మంగళవారం కదిరి రూరల్ మండలం కుమ్మరవాండ్లపల్లిలో బత్తల హరిప్రసాద్ను, మాజీ సర్పంచ్ బత్తల వెంకట రమణను కలిసి ఆలయ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈసందర్భంగా గ్రామస్తులు కలిసి బత్తల హరిప్రసాద్ను సత్కరించారు. ఈసందర్భంగా డాక్టర్ బత్తల హరి ప్రసాద్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తామనిహామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మధుసూదన్, ప్రతాప్, సుబ్బయ్య, గంగులప్ప, రమణ, వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

మాజీ మార్కెట్యార్డు ఛైర్మన్కు పరామర్శ



మాజీ మార్కెట్యార్డు ఛైర్మన్ను పరామర్శిస్తున్న బికెం

రొద్దం : పెనుగొండ మాజీ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ వెంకట్రామిరెడ్డిని మాజీ ఎమ్మెల్యే, టిడిపి జిల్లా అధ్యక్షుడు బికె.పార్థసారథి మంగళవారం పరామర్శించారు. వెంకట్రామిరెడ్డి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న పార్థసరధి, పెనుగొండ నియోజకవర్గం టిడిపి అధ్యక్షులు చిన్నప్పయ్యతో కలిసి ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. అనంతరం ఆయన అల్లుడు శశిభూషణ్ తోపాటు సత్యసాయిజిల్లా అధికార ప్రతినిధి నరసింహులు, మండలం టిడిపి ప్రధాన కార్యదర్శి మురళి, కల్లుకుంట చిరంజీవి, తదితరులు పరామరహించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



మృతిచెందిన ప్రతాప్రెడ్డి

గుంతకల్లు రూరల్ : మండల పరిధిలోని చింతలంపల్లి గ్రామంలో చోటు చేసుకున్న విద్యుత్ ప్రమాదంలో ప్రతాప్రెడ్డి (30) మృతి చెందిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. బళ్లారి జిల్లా కంప్లి కొట్టాలకు చెందిన ప్రతాప్రెడ్డి రెండు రోజుల నుండి కంది పంట కోత మిషన్తో పనులు చేస్తున్నాడు. ఈనేపథ్యంలో మంగళవారం మధ్యాహ్నం మిషన్పై ఉన్న విద్యుత్ వైర్లను గమనించకుండా టాప్పైకి ఎక్కడంతో విద్యుత్ తీగలు తగిలి కింద పడ్డాడు వెంటనే పొలంలో ఉన్న రైతులు ఆటోలో గుంతకల్లు ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యంలోనే మృతి చెందినట్లు తెలిపారు. ఈమేరకు రూరల్ పోలీసులు మృతదేహాన్ని శవ పరీక్షల నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించి స్థానికులు తెలిపిన వివరాల మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మిరప పంటకు గడ్డిమందు పిచికారీ

ద్విచక్రవాహనానికి నిప్పు

బొమ్మనహాల్ : మండలంలోని కలవలతిప్ప గ్రామంలో రైతు చాకలి నాగేంద్రకు చెందిన నాలుగెకరాల మిరప పంటకు గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం రాత్రి గడ్డి మందు పిచికారి చేశారు. అంతేగాకుండా అర్ధరాత్రి ఇంటి వద్ద ఉన్న తన ద్విచక్ర వాహనానికి నిప్పు పెట్టడంతో పూర్తిగా కాలిపోయినట్లు బాధితుడు వాపోయాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు భయభ్రాంతులకు గురవుతున్నారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మంగళవారం ఉదయం 8 గంటలకు చేరుకున్న పోలీసులు డాగ్ స్క్వాడ్, వేలిముద్రల నిపుణులను గ్రామానికి చేరుకుని పరిశీలించారు. పూర్తి వివరాలు సేకరించి కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు. కాగా రైతు మిరప పంటకు గడ్డిమందు పిచికారి చేయడంపై రైతులు భయభ్రాంతులకు గురవుతున్నారు. పొలాల్లో ఎక్కడికక్కడే వరిధాన్యం, మిరపపంట, మొక్కజొన్నలు ఆరబోశామని, ఇలా చేస్తే ఎలా వాపోతున్నారు. కాగా రైతులందరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ సూచించారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామని ఎస్ఐ తెలిపారు.